'మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది '



సాక్షి,మేడ్చల్ జిల్లా: క్రైస్తవ మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్ అన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ ఆడిటోరియంలో క్రిస్టియన్ మైనార్టీ సంఘాల ప్రతినిధులు, ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. క్రైస్తవుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. వారు రాజకీయ, సామాజికంగా ప్రగతి సాధించాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. ప్రభుత్వ పథకాలను క్రైస్తవులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యా ఉపాధి రంగంలో క్రిస్టియన్లు రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా మాట్లాడుతూ.. క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలను అర్హులైన మైనారిటీల కుటుంబాలకు అందజేస్తామని తెలిపారు. మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కాంతమ్మ, పాస్టర్లు, క్రిస్టియన్ మైనారిటీ సంఘాల జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో ముందుకుసాగాలి



విద్యార్థులతో ఎమ్మెల్యే మాల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు పట్టుదలతో ముందుకు సాగి, తమ ప్రయాణాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దుకోవాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి స్కూల్ ఆఫ్ అల్‌లైడ్ అండ్ హెల్త్‌కేర్ సైన్సెస్ ఆడిటోరియంలో నిర్వహించిన 'ఓరియెంటేషన్' డే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. మల్లారెడ్డి గ్రూప్స్ కార్యదర్శి భద్రారెడ్డి, యూనివర్సిటీ వీసీ వీఎస్‌కేరెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



మాధవరెడ్డి

మేడ్చల్: మండల వ్యవసాయాధికారిగా మాధవ్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు. వ్యవసాయాధికారిగా పనిచేసిన అర్చన బదిలీకావడంతో మాధవ్‌రెడ్డి బదిలీపై మేడ్చల్‌కు వచ్చారు. రాజేంద్రనగర్ డీడీఏ కార్యాలయంలో పనిచేసిన ఆయన బదిలీపై మేడ్చల్‌కు వచ్చారు.

ఓ వైపు అవస్థలు.. మరోవైపు ఎదురుచూపులు !

చిరువ్యాపారులకు కనీస సౌకర్యాలు కరువు
- పెండింగ్‌లో మార్కెట్ భవన నిర్మాణ పనులు
- ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్న వాహనదారులు



నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రతివారం కొనసాగుతున్న వారాంతపు సంతలో సౌకర్యాలు లేక ఇటు చిరువ్యాపారస్తులు, అటు కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. రెండు మున్సిపాలిటీలు పట్టణాలుగా మారిపోవడంతో పెద్ద సంఖ్యలో జనాభా నివాసం ఉంటున్నారు. ప్రజలు తమకు కావాల్సిన కూరగాయాలతో పాటు, వివిధ రకాల గృహోపకరణాలు కొనుగోలు చేసేందుకు వారాంతపు సంతలపై ఆధారపడాల్సి ఉండటంతో వీటికి ప్రాధాన్యత రోజురోజుకు పెరుగుతోంది.

◆ నాగారం, దమ్మాయిగూడలోని వివిధ కాలనీలు సహా, కీసర, రాంపల్లి , అహ్మద్‌గూడ, రాంపల్లి చౌరస్తా, ఆర్‌ఎల్‌నగర్, చీర్యాల తదితర గ్రామాల్లో వారంతపుసంతలు కొనసాగుతున్నాయి. గ్రామాల్లో వారాంతపుసంతను నిర్వహించేందుకు ఆయా ప్రాంతాల్లో సరైన స్థలాలు లేకపోవడంతో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులపైనే ఇప్పటికీ వారాంతపు సంతలు కొనసాగుతున్నాయి.

◆ ప్రజలు నిత్యావసరాలతో పాటు, అన్ని రకాల వస్తువులు సంతల్లో లభిస్తుండటం వల్ల గ్రామాల్లో ఈ సంతల నిర్వహణకు ప్రజల నుంచి ఆదరణ రోజు రోజు పెరుగుతోంది. కానీ అసౌకర్యాల మధ్యే సంతను నిర్వహించుకోవాల్సివస్తుందని, చిరు వ్యాపారులు, కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్న వాహనదారులు..

రహదారుల సమీపంలోనే సంతలు కొనసాగుతుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. సంత జరిగే రోజు కొన్ని గ్రామాల్లో రోడ్లు బంద్ అయ్యే పరిస్థితి నెలకొంటోంది. దీంతో ఒక్కోసారి ప్రజలు కుడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇక వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.



కీసరలో వారంతపు సంత

మార్కెట్ యార్డ్ భవనాలు పూర్తిచేయరా..?

నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు చోట్ల ప్రభుత్వ స్థలాల్లో కొట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డుల భవననిర్మాణ పనులు సగంలోనే నిలిచిపోయాయి. ప్రస్తుత పాలకులు పట్టించుకుని నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ వెజ్‌నాన్‌వెజ్ మార్కెట్‌యార్డుల భవన నిర్మాణాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని, నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

◆ రాంపల్లి, కీసర, ఆర్‌ఎల్‌నగర్, చీర్యాల తదితర ప్రాంతాల్లో కుడా మార్కెట్ యార్డుల కోసం ప్రభుత్వ స్థలాలను కేటాయించి, మార్కెట్‌యార్డు భవనాలను నిర్మించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం జరుగుతున్న వారాంతపు సంతలో తాగు నీరు, మరుగుదొడ్లు తదితర విద్యుత్ సౌకర్యం తదితర సౌకర్యాలను కల్పించాలని చిరువ్యాపారస్తులు డిమాండ్ చేస్తున్నారు.

వసూళ్లపై ఉన్న దృష్టి.. సౌకర్యాలపైనేది.?

వారాంతపు సంతలో తాయిబజార్ పేరిట చిరు వ్యాపారుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారే తప్పా.. సౌకర్యాలు కల్పించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారులు స్పందించాలి



ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ వెజ్‌నాన్‌వెజ్ మార్కెట్ యార్డుల భవన నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– చంద్రారెడ్డి, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్

ప్రభుత్వ స్థలాలను కేటాయించాలి



నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల పరిధిలోని మిగతా గ్రామాల్లో కొనసాగుతున్న వారాంతపు సంతలకు పక్కా ప్రభుత్వ స్థలాలను కేటాయించి మార్కెట్ యార్డు భవనాలను నిర్మించాలి.

– జిల్లాల తిరుమల్‌రెడ్డి

రైతుల రిలే నిరాహార దీక్ష



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలోని 1200 మంది రైతు (సభ్యులు)లకు రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నేత కృష్ణారెడ్డి, బీజేపీ కార్యవర్గసభ్యురాలు శోభారాణి అన్నారు. రైతు రుణమాఫీ సాధన సమితి అధ్యక్షుడు గౌరీశంకర్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం చేపట్టిన రిలే నిరహార దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా.. రైతులకు రుణమాఫీ కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ అయ్యేంత వరకు అన్నదాతల పక్షాన పోరాటం చేస్తామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ స్రవంతికృష్ణారెడ్డి, ప్రవీణ్‌రావు, మహిపాల్‌రెడ్డి, మహేశ్వర్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, సాయిరెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

ఇలాగైతే వెళ్లేదెలా ?



రోడ్డు మధ్య ఉన్న స్తంభాలను పరిశీలిస్తున్న అధికారులు

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెనకు ఇరువైపుల ఉన్న రోడ్డులో దారికి అడ్డుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలను స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ప్రయాణికులు సాఫీగా వెళ్లేందుకు రోడ్డు మధ్యన ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలని అధికారులను స్థానికులు కోరారు. వారం రోజుల్లో విద్యుత్ మరమ్మతులు పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. జంగయ్యయాదవ్, ఆంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, విద్యుత్ అధికారులు, హెచ్ఆర్‌డీసీ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్‌లో ఎస్‌డీఎఫ్ నిధులతో జరుగుతున్న సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ పరిశీలించారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తూ.. కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు మాట్ల వినయ్‌కుమార్, రాజుయాదవ్, లక్ష్మణ్‌నాయక్, యాదగిరి, బాలరాజు తదితరులున్నారు.



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న శ్రీకాంత్‌యాదవ్

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలి



పరిశీలిస్తున్న కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి

మేడ్చల్: యజమానులు పెంచుకునే పెంపుడు కుక్కలకు తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కేఎల్‌ఆర్ వెంచర్ బ్లూక్రాస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వ్యాక్సినేషన్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కుక్కకాటు వల్ల రేబీస్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, పెంపుడు జంతువుల వల్ల వాటి నుంచి యజమానులకు వ్యాధులు సోకే అవకాశం ఉందని, తప్పనిసరిగా కుక్కలకు వ్యాక్సినేషన్ చేయించాలని కోరారు. శిబిరంలో 286 కుక్కలకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. బ్లూక్రాస్ సంస్థ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. శిబిరంలో మున్సిపల్ సిబ్బంది, బ్లూక్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై ఫిర్యాదు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లిలో కుక్కల బెడదతో పాటు డ్రైనేజీ సమస్యలపై మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్‌కు పలువురు స్థానికులు బుధవారం ఫిర్యాదు చేశారు. నారపల్లిలోని 14, 15, 16, 17 వార్డుల్లో కుక్కల బెడద అధికంగా ఉండటంతో రోడ్లపై వెళ్లాలంటే మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు భయపడుతున్నారన్నారు. సప్తగిరి కాలనీ అసోసియేషన్ కమిటీ సభ్యులు దేశం వినయ్, కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, వెంకటేష్ తదితరులున్నారు.

◆ నారపల్లిలోని 15వ వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. డ్రైనేజీ వ్యవస్థకు ఔట్‌లెట్ లేకపోవడంతో నివాసప్రాంతానికి సమీపంలోని రెండెకరాల ఖాళీ స్థలంలోకి మురుగు వచ్చి చేరుతోందని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. రామకృష్ణ, శ్రీనివాస్‌చారి, శివకుమార్, మానస, స్రవంతి, మాధవి తదితరులున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న స్థానిక కాలనీవాసులు

కీసర ఆలయ హుండీ లెక్కింపు

కీసర: కీసరగుట్ట రామలింగేశ్వర దేవస్థానం ఆరు నెలల హుండీని రంగారెడ్డి జిల్లా సహాయ కమిషనర్ పర్యవేక్షణలో లెక్కించారు. బుధవారం హుండీ లెక్కించగా.. రూ.23,67,789 ఆదాయం, అన్నప్రసాదం వద్ద రూ.68,345 ఆదాయం వచ్చిందని వివరించారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, నర్సింహ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగిక దాడి..

పోక్సో కేసులో మూడేళ్ల జైలు

మేడ్చల్/అల్వాల్: జుడిషియల్‌లోని అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి మేడ్చల్ పోక్సో కోర్టు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. కోర్టులో ప్రభుత్వం తరుపున న్యాయవాది విజయ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 2016లో అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగేళ్ల చిన్నారిపై విజయ్‌కుమార్ అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు గురిచేయడంతో అల్వాల్ పోలీసులు నిందితుడి అరెస్ట్ చేశారు. అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా.. మేడ్చల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి అమరావతి బుధవారం తీర్పు వెల్లడించారు. నిందితుడికి మూడేళ్ల జైలు రూ.,10వేల జరిమానా, బాలికకు రూ.20వేల నష్టపరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు.

'ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు'

మేడ్చల్‌రూరల్: సమస్య ఏదైనా ఆత్మహత్య పరిష్కారం కాదని మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సైక్రియాట్రీ విభాగం హెడ్ ప్రొఫెసర్ అనురాగ్ శ్రీవాత్సవ్ అన్నారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా కళాశాలలో పలు కార్యక్రమాలను చేపట్టారు. వైద్య విద్యార్థులు ఆత్మహత్య నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు పోస్టర్లు ప్రదర్శించి యువత ఆత్మహత్యలకు గల కారణాలు, నివారణ అంశాలపై మాట్లాడారు. దేశంలో రోజురోజుకు ఆత్మహత్యలు పెరగడం, యువత ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమన్నారు. వైద్యులు, మెడికల్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అనురాగ్ శ్రీవాత్సవ్

అణచివేతపై పోరాడిన వీరవనిత ఐలమ్మ

జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

సాక్షి,మేడ్చల్ జిల్లా: సమాజంలో అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ నేటి యువతకు స్ఫూర్తిదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. బుధవారం చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌హాల్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, వివిధ కుల సంఘాల ప్రతినిధులతో కలిసి అదనపు కలెక్టర్ రాధికాగుప్తా జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ సామాజిక సమానత్వం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని, ఆమె పోరాటం కేవలం ఒక వర్గానికే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. నేటి యువత ఐలమ్మ ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలన్నారు. బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఝాన్సీరాణి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి కాంతమ్మ, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి వినోద్‌కుమార్, వివిధ కుల సంఘాల జిల్లా ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



8 నెలల్లో 687 డెంగీ కేసులు !

- జీహెచ్ఎంసీ సర్కిళ్లు, పురపాలికల్లోనే అధిక కేసులు
- ఫీవర్ సర్వేలో 2,148 మంది జ్వరపీడితులు
- ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు



సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. చాపకింద నీరులా డెంగీ మహమ్మారి విస్తరిస్తోంది. చికూన్‌గన్యా, మలేరియా కేసులు కూడా నమోదవుతున్నాయి.

◆ జీహెచ్ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లు, బస్తీలు, పురపాలక సంఘాలు, కాలనీలు, పట్టణాల్లో ఇంటికొకరు జ్వరం బారినపడుతున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ కిట్లతో నిర్ధారణ పరీక్షలు చేస్తూ.. ప్లేట్లెట్లు (రక్తకణాలు) కొంత తగ్గినా డెంగీగా పేర్కొంటూ.. బాధితులను ఆందోళనకు గురిచేస్తున్నారు. ప్రత్యేక చికిత్స పేరిట రూ. లక్షల్లో దండుకుంటున్నారని ఆరోపణలున్నాయి.

◆ జనవరి నుంచి ఈనెల 8 వరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 687 డెంగీ కేసులు నమెదు కాగా.. జీహెచ్ఎంసీ పరిధిలో 499, పురపాలికల్లో 188 కేసులు నమోదయ్యాయి. విష జ్వరాలతోబాధ పడుతున్న వారు కూడా 2వేలకు పైగా ఉన్నట్లు సమాచారం.

◆ బస్తీలు, పురపాలికల్లో బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు లభించకపోవడంతో నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగెడుతున్నారు. పురపాలక సంఘాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండటంతో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారి, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి.

◆ పురపాలక సంఘాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక చేపట్టినా.. విషజ్వరాలు మాత్రం ఏమాత్రం తగ్గటం లేదు.

మందుల పంపిణీ..

15 మండలాల పరిధిలో జనవరి నుంచి ఇప్పటి వరకు 11.52 లక్షల ఇళ్లలో 47.21 లక్షల మందికి ఫీవర్ సర్వే నిర్వహించగా.. 2,148 మంది ప్రజలు జ్వరంతో బాధపడుతున్నట్లు వైద్యశాఖ గుర్తించి, వారికి మందులు (మెడిసిన్) అందజేశారు. ఫీవర్ సర్వేలో భాగంగా జిల్లా వైద్యారోగ్యశాఖ వ్యాధి కారకాలైన దోమలు, అపరిశుభ్రత, ఆహారం, పరిసరాల పరిశుభ్రత, నీటి శుభ్రతపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. అవసరమున్న చోట హెల్త్‌క్యాంపులతో పాటు రక్త నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అడ్డగోలుగా బిల్లులేసి..

తూంకుంటలో ఓ రోగికి జ్వరం రాగా.. చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఎర్ర రక్తకణాలు భారీగా పడిపోయాయని ఆందోళనకు గురిచేసి ప్లేట్లెట్లు ఎక్కించాలని నిర్దేశించారు. రోగికి చికిత్స నిమిత్తం రూ.లక్షకు పైగా వసూలు చేసినట్లు తెలుస్తోంది.

◆ స్థానిక డాక్టర్ల సూచనలతో రోగులు ప్రైవేటు ఆసుపత్రుల బాటపట్టారు. ప్లేట్లెట్ల సంఖ్య తగ్గాయనే నెపంతో రోగుల నుంచి భారీగా వసూలు చేసిన విషయంపై స్థానికులు జిల్లా వైద్యారోగ్యశాఖకు మొరపెట్టుకుంటున్నారు.

అమలుకు నోచుకోని ఆదేశాలు

ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు టీ-హబ్ కేంద్రాలలో నిర్ధారణ తర్వాతే డెంగీ కేసుల వివరాలు వెల్లడించాలని వైద్యారోగ్యశాఖ ఆదేశాలు జారీచేసినా.. ఇందుకు విరుద్ధంగా జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గగానే డెంగీగా నిర్ధారిస్తూ రోగిని బెంబేలెత్తిస్తున్నారు. ఆయా ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాల్సిన వైద్యశాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో డెంగీ కేసుల నమోదు ఇలా..

డెంగీ కేసులు	– 687 (జీహెచ్ఎంసీ పరిధిలో 499, పురపాలికల్లో 188)
చికూన్ గన్యా	–09
మలేరియా	–03

డెంగీ ఇక్కడే..

జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతంతో పాటు కూకట్‌పల్లి, గాజులరామారం, మల్కాజిగిరి, ఉప్పల్, కాప్రా, కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిళ్లలో బస్తీలతో పాటు బోడుప్పల్, పీర్జాదిగూడ, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, మేడ్చల్ పురపాలక సంఘాల్లో పేరుకుపోయిన పారిశుద్ధ్యం, చెత్త,చెదారం దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు డెంగీ, మలేరియా, చికూన్ గన్యా వ్యాధుల బారినపడుతున్నారు. వాటి నివారణకు ఫాగింగ్ చేయలేదనే విమర్శలున్నాయి.

నిర్లక్ష్యం చేయొద్దు..

జ్వరం అనిపిస్తే అలస్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్యుడిని సంప్రదించాలి. డెంగీ, మలేరియా, చికూన్ గన్యా, టైఫాయిడ్ పరీక్షలు ఉచితంగా చేస్తారు. ఫీవర్ సర్వేలో జ్వర బాధితులను గుర్తించి మందులు ఇస్తున్నాం.

– డాక్టర్ శ్రీదేవి, ప్రోగ్రామ్ అధికారి

వీరనారికి ఘన నివాళి

మేడ్చల్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మేడ్చల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించారు. పట్టణంలోని ఐలమ్మ విగ్రహం వద్ద, వివిధ ప్రాంతాల్లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి, రాంచందర్, కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, పోచయ్య, సుదర్శన్‌రెడ్డి, వెంకటేష్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.ఆమె విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల ఐలమ్మ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఘట్‌కేసర్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో రజక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



కీసరలో నివాళులర్పిస్తున్న దృశ్యం



ఘట్‌కేసర్‌లో ముత్యాలుయాదవ్ తదితరులు



జవహర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు